భయపడి, సందేహించి మళ్ళీ బాబాయి ఏమనుకుంటాడో అని ధైర్యంచేసి క్రింద చతికిలబడ్డాడు. కొబ్బరి బొండాలు తీయించాడు బాబాయి. తను ఒక బొండాం తాగేసరికి మిగిలినవాళ్లు తలో నాలుగుబొండాలూ తాగేశారు. తనకి చొక్కానిండా, పట్లాం నిండా అయింది. గుంజు తింటూంటే మూతి అంతా అయింది. మరి వాళ్ళందరూ వింతగా తనకేసి చూడలేదు ఎయిర్‌కండిషను రూములోవాళ్లలాగ. బాబాయి ఏం బాధపడలేదు అతను బాంగీములో గడ్డిపుల్ల రవాటేస్తే తను బాధపడినట్లు.

ఎదురుగుండా రైతు పొలం దున్నుతున్నాడు "నేనోసారి ట్రైచేస్తాను బాబాయ్" అన్నాడు రైతుకేసిచూస్తూ రామం. ఆ ఇంగ్లీషుముక్క అర్థంకాకపోయినా సందర్భం గ్రహించాడు బాబాయి.

"అల్లాసే కానివ్వవోయ్" అని "ఒరేనాగా మావోడ్నోచెయ్యేస్తాట్ట" అని కేకేసాడు. తను నాగలిమీద చెయ్యేసి రెండు అడుగులేసేసరికి బెడ్డల్లో కాళ్ళుకొట్టుకుపోయాయి. చెయ్యిరాపిడికి మండి బొప్పర్లు రేగటం ప్రారంభించింది.

"మరేమనుకున్నావురా వ్యవసాయం అంటే?" అని నవ్వేడు బాబాయి.

చీకటిపడింది. ఓప్రక్క కీచురాళ్ళ చప్పుడు. పొలంగట్లమీద నడుస్తూంటే ముందునడుస్తూన్న బాబాయి కిర్రుచెప్పుల చప్పుడు రామం హృదయానికిఎంతో నిబ్బరం కలిగించింది.

మర్నాడు "వెళ్ళొస్తాను బాబాయి" అని ఇంటిమొహంపట్టాడు రామం. దారిలో కలిగింది రామం హృదయంలో ఓ ప్రశ్న — పట్నంలో బాబాయి, పల్లెటూళ్ళో తనూ. ఇందులో సమర్థులెవరని?

# క్షణంలో సగం

"శారద"

మనకి నాయకులున్నారు. వాళ్లు కష్టపడి ఒక రకం రాష్ట్రం తెచ్చారు; ఎందుకంటే ఏదీ దానంతటది రాదు గనక అనుకుంటా. అయితే రాజధాని ఎక్కడా అని ప్రారంభమైన తగువు ఈ రోజున ఒకరకంగా శమించినట్టు కనిపించినా ఇంకా కొందరు నాయకులకు (అట్లాగని వాళ్ళింకా అంటున్నారు ఖర్మ!) ఆ సమస్య కలల్లోకి వస్తోందిట. కర్నూలులో డేరాలన్నీ విజయవాడకు పోతున్నట్టూ, విశాఖపట్నంలో పిచ్చాసుపత్రి - కర్నూలుకేసి బయల్దేరినట్టూ, హైకోర్టు ఎటూపోలేక ఆకాశంలో ఉన్నట్టూ కల వస్తోందిట.

పైగా ప్రతి శాసనసభ్యుడికి రహస్యంగా "నీకూ ఓ మంత్రిపదవి ఇస్తాం-నాకోవోటు వెయ్యవూ?" అని ప్రధానమంత్రి కావాలనుకుంటున్న వారినించి ఉత్తరాలు వొచ్చినట్టు కల వస్తోందిట. ఇది రహస్యం.

* * *

కర్నూల్‌లో కాఫీహోటల్సు పెట్టదలచిన వారికి అక్కడి మున్సిపాలిటీ ఏ రకం సౌకర్యాలైనా చూపగలదటగాని, నీళ్ళ సంగతి పట్టించుకోదట. కృష్ణనో, గోదావరినో, అటు మళ్ళించటానికి అక్కడ హోటల్ పెట్టిన అయ్యర్లు మహాసభ ఒకటిచేసి, అట్టి "ఆలోచన" "ప్లాను" వెయ్యగల సమర్థులు వెనకటి "కృష్ణాపెన్నారు ప్రాజెక్టు" మహానుభావులే అని తీర్మానించి వారికే తమ కోరికను సమర్పించినారని తెలుస్తోంది.

* * *

కర్నూలు వెళ్ళగల ఉద్యోగులకు ఒక ప్రత్యేక పరీక్ష పెట్టగలరని గాలివార్త వచ్చింది. ఎటువంటి "సైజు" దోమ కుట్టినా తట్టుకోగల వారికిన్నీ, శిలలనుండి ద్రవాలు తెప్పించగల వారికిన్నీ ప్రత్యేకమైన 'ప్రిఫరెన్సు' ఇవ్వగలరట.

* * *

ఆంధ్రరాష్ట్రాన్ని ఫ్రాన్సుతో పోల్చారు ఎవరో ఇటీవల; అది ఉద్యోగులను గురించి మాత్రమే గాదట, మంత్రివర్గాలు కూడా ఫ్రాన్సు

మూదిరే క్షణక్షణానికి మారగలవనీ ఆ పోల్చిన వారు అనలేదని తెలుస్తున్నది.

* * *

ఉత్తరోత్తరా ఆంధ్ర ప్రభుత్వ మంత్రివర్గపు "తగాదాలు" ఇనుమడించే ఆశ ఎంతయినా ఉందనీ, బహుశా డాక్టర్ల అవసరం ఎక్కువ అనీ గుర్తించి, ఎక్కువమంది డాక్టర్లని కర్నూలుకు పిలిపించగలరట.

* * *

కర్నూలు ఆంధ్ర శాసనసభా భవనంలో గోడలమీద, లోగడ కర్నూలునే రాజధానిగా చెయ్యడానికి కష్టపడ్డవారి బొమ్మలు, ఆనాటి దృశ్యాలూ, సుప్రసిద్ధ చిత్రకారులచేత గీయించి కనులపండువ చేదామని ఒకానొక "కర్నూలు"అభిమాని ఘోరంగా ప్రయత్నిస్తున్నాడట. అటువంటి చిత్రాలు ఎక్కువగా, కుస్తీ దృశ్యాలూ, నీరసావేశ దృశ్యాలూ అయివుంటాయని ఊహిస్తున్నారటగూడా.

* * *

ప్రతిదానికీ ఆంధ్రనాయకులు ఢిల్లీ పరిగెత్తటం ఎట్లావుందంటే-వివేకరావుగారు ఇలా అన్నారు: " 'కానివాడినోట బూతులైనాసహిస్తాంగానివినవాడినోట యథార్థాన్ని మాత్రం భరించలేం' అనే సూక్తికి అనుగుణంగా వుంది" అని.

* * *

ఆంధ్ర శాసనసభలోని అతివాదుల సంఖ్యని గురించి ఇతరులు ఎందుకు ఆలోచించటంలేదా అని విచారిస్తే, ఆ ఆలోచన కడుపులో దేవినట్టుంటోందనీ, బొత్తిగా కమ్యూనిస్టుల సంఖ్యను ఈ అక్టోబరు ఒకటవతారీకునాడైనా తలవకుండా ఉంటేనేతప్ప ఇతరపనులు సాగే అవకాశమే లేదనీ తెలుస్తోంది.

* * *

రాజకీయాలలో "స్వతంత్రు"లుగా పాల్గొనే పెద్దమనుషులకి ఎటువంటి స్వతంత్రేచ్ఛ ఉంటుందో ఆంధ్ర మంత్రివర్గ నిర్మాణపద్ధతులలో తెలుసుకోవచ్చనీ, జాకీ మనోలా లేకుండా ఆట చెప్పి పాడినుక్కలను ఆశించేవారికి ఈ స్వతంత్రులు ఉపయోగించగలరని ఆశించబడుతున్నదని అని తీగలేని టెలిఫోన్ వార్త.


# హిందూస్థాన్ కో-ఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీ లిమిటెడ్ లో

ఒక జీవితభీమా పట్టా తీసుకొని మీ భవిష్యత్తు భద్రపరచుకోండి.
మానవావసరములను తీర్చగల మహనీయ సంస్థ.
ఆంధ్రదేశంలో వ్యాపార సంబంధీకుల అవసరాలు తీర్చుటకై 1945లో విజయవాడయందు ఒక బ్రాంచిని నెలకొల్పినది.

ఈ దిగువ అంకెలు ఈ సొసైటీ సౌష్ఠవాన్నీ, ఋజుత్వాన్నీ, బలాన్నీ నిరూపించుచున్నవి.

| | |
|---|---|
| అమలునందున్న వ్యాపారము | రు. 86,71,85,040 |
| ఆస్తుల మొత్తము | 22,49,83,056 |
| జీవిత, ఇతర చిల్లర, నిధి | 19,77,76,287 |
| చెల్లించిన క్లైములు (1952) | 88,82,271 |

ఆంధ్ర జిల్లాలలో యీ సొసైటీకి ప్రతినిధులు కాదలచినవారు యీ క్రింది చిరునామాకు వ్రాయండి:

**ఐ. కె. రాయ్, బి. ఏ.**
బ్రాంచి మేనేజరు, విజయవాడ.
పోస్టుబాక్సు నెం. 12. బకింగ్‌హామ్‌పేట పోస్టు, విజయవాడ.